
సాక్షి తిరుపతి

సోమవారం। 10। జూన్। 2024



రాను పోను టికెట్‌తో ఆదా!

తిరుపతి– తిరుమలకు రాను పోను టికెట్ తీసుకుంటే ప్రయాణికులకు రూ.20 రాయితీని ఆర్టీసీ అందిస్తోంది. - 2లో



చెట్టొక్కటే ఫలాలు వేరు!

ఏర్పేడు మండలంలో ఓ రైతు పెంచిన మామిడి చెట్టు వివిధ రకాలను కాయలను కాస్తోంది. - 2లో



జోరుగా వరినాట్లు

జిల్లాలోని తూర్పు మండలాల్లో కొద్దిరోజులుగా వర్షాలు కురుస్తుండడంతో వరినాట్లు జోరందుకున్నాయి. - 2లో

న్యూస్‌రీల్

ముత్యాలమ్మకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

చిల్లకూరు : తూర్పుకనుపూరులోని ముత్యాలమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువనే అమ్మవారిని సుప్రభాతంతో మేల్కొలిపారు. మూలమూర్తికి విశేష అభిషేకం చేశారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఆలయ ఆవరణలో మహిళలు పొంగళ్లు పొంగించి నైవేద్యం సమర్పించారు. పెద్దసంఖ్యలో తరలి వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు. ఆలయ కమిటీ చైర్‌పర్సన్ సిద్ధారెడ్డి ఇంద్రసేనమ్మ, ఈఓ నవీన్‌కుమార్, సభ్యుడు దువ్వూరు చంద్రశేఖర్‌రెడ్డి పర్యవేక్షించారు.

నాలుగో స్థానంలో 'నోటా'!

తిరుపతి అర్బన్ : ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు ఎవరికీ ఓటు వేయకూడదు అనుకుంటే సదరు ఓటరు నోటాకు మొగ్గుచూపవచ్చు. ఈ సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లు పెద్దసంఖ్యలో నోటాకు ఓటు వేశారు. ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులను కాకుండా ఈవీఎంలపై నోటా బటన్ నొక్కారు. దీంతో తిరుపతి పార్లమెంటరీ పరిధిలో 15,909 ఓట్లు నోటాకు పోలయ్యాయి. వైఎస్సార్‌సీపీ, బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థుల తర్వాత నాలుగో స్థానం నోటాకే దక్కడం విశేషం. మరోవైపు జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో చూస్తే 17,309 ఓట్లు నోటాకు పడ్డాయి. ప్రధానంగా వెంకటగిరి, తిరుపతిలో వైఎస్సార్‌సీపీ, టీడీపీ కూటమి తర్వాత నోటా మూడో స్థానం కైవసం చేసుకుంది. గూడూరు, శ్రీకాళహస్తి, సూళ్లూరుపేట, చంద్రగిరి, సత్యవేడులో వైఎస్సార్‌సీపీ,టీడీపీ కూటమి, కాంగ్రెస్ తర్వాత నాలుగో స్థానంలో నిలిచింది.

జూలై 6న నాయుడుపేటకు 'చాగంటి'



సమావేశంలో చాగంటి సేవ సంఘ నాయకులు

నాయుడుపేటటౌన్: ప్రవచన కర్త చాగంటి కోటేశ్వరరావు జూలై 6,7 తేదీల్లో నాయుడుపేటకు వస్తున్నట్లు చాగంటి సేవా సంఘం నాయకులు తెలిపారు. ఆదివారం ఈ మేరకు పట్టణంలోని వాసవీ కల్యాణ మండప ఆవరణలో వారు సమావేశం నిర్వహించారు. జాతీయ రహదారి సమీపంలోని ఓ ప్రైవేట్ కన్వెన్షన్ సెంటర్లో రెండు రోజులపాటు చాగంటి కోటేశ్వరరావు ప్రవచన కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. పెద్దసంఖ్యలో ఆధ్యాత్మిక వేత్తలు, భక్తులు తరలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మెంటా మల్లికార్జున, అవధానం సుధీర్, యచ్చా శ్రీని వాసులు, గూడూరు కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



జ్ఞాపికలు అందుకుంటున్న క్రీడాకారులు

తిరుపతి ఎడ్యుకేషన్ : క్రీడలతో శారీరక ధృడత్వంతోపాటు మానసికోల్లాసం కలుగుతుందని ఫ్రెండ్లీ ఫైటర్స్ క్రికెట్ అకాడమీ హెడ్ కోచ్ మస్తాన్ తెలిపారు. తిరుపతి నెహ్రూ మున్సిపల్ హైస్కూల్ మైదానంలో మే 5 నుంచి 36రోజుల పాటు నిర్వహించిన సమ్మర్ క్రికెట్ క్యాంప్ ఆదివారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబరచిన ఆటగాళ్లకు సీడీసీఏ సెక్రటరీ గిరిధర్, టీటీడీ కో–ఆపరేటివ్ బ్యాంక్ డైరెక్టర్ ఎ.మునిరెడ్డి, సంస్కృత విద్యాపీఠం ప్రొఫెసర్ వెంకట శ్రీనివాసులు చేతులమీదుగా పతకాలు, జ్ఞాపికలు అందజేశారు. మెడల్స్, మెమొంటోలను అందజేశారు.

అలసి..సొలసిన మనసుకు కాస్త స్వాంతన దొరకాలని పరితపిస్తుంటారు. ఖాళీ సమయంలో సరదాగా గడపాలని ఉబలాట పడుతుంటారు. ఇలా కొందరు తూపిలిపాళెం బీచ్‌కు వచ్చి సంతోష సాగరంలో మునిగితేలుతుంటారు. జలకాలాట ఆడుతూ.. కెరటాలతో సెల్ఫీలు దిగుతూ కేరింతలు కొడుతుంటారు. ఈ క్రమంలో అక్కడ ప్రమాదకరంగా ఉన్న జెట్టీ నిర్మాణంపై నుంచి కొందరు సముద్రంలోకి దూకి హీరోయిజం ప్రదర్శిస్తుంటారు. ఇలా దూకిన చాలామంది జలసమాధి అవుతున్నారు. కూలేందుకు సిద్ధంగా జెట్టీ కింద సుడిగుండాలు పొంచి ఉన్నాయని తెలియక ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. దీనిపై పోలీస్ శాఖ స్పందించి.. రక్షణ చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

మింగేస్తున్న జెట్టీ!



శిథిలావస్థకు చేరిన జెట్టీ పిల్లర్లు

- విహారం మాటున పొంచి ఉన్న విషాదం
- తీరంలో ప్రమాదకరంగా నిర్మాణం
- పర్యాటకులకు జాగ్రత్త అవసరం



తూపిలిపాళెం తీరంలో పర్యాటకుల సందడి

వాకాడు: తూపిలిపాళెం బీచ్‌కు జిల్లా నలుమూలల నుంచే కాకుండా ఇతర జిల్లాల నుంచి విద్యార్థులు, పర్యాటకులు పెద్ద సంఖ్యలో తరలివస్తుంటారు. సాధారణ రోజుల్లో రోజుకు పదివేల మందికిపైగా.. ఆదివారం.. సెలవు రోజుల్లో అయితే లక్షల మంది వచ్చి జలకాలాడుతుంటారు. అందుకు అనుగుణంగానే తీరంలో ఎటుచూసినా పచ్చని సవకతోటలు, ఆహ్లాదకరమైన వాతావరణం కనిపిస్తుంది. మరో పక్క నిత్యం సముద్రపు అలలతో సుందరమైన ప్రకృతి ఇక్కడ పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటుంది. ఈ క్రమంలో తూపిలిపాళెం బీచ్‌కు వచ్చేవారు ఇక్కడి అందమైన ప్రదేశాలను సందర్శించి సంతోషంతో ఉప్పొంగిపోతుంటారు. ఈ సుందరమైన ప్రదేశం వెనక తెలియని అతి భయంకరమైన విషాదం ఉందన్న నగ్నసత్యాన్ని చాలా మంది గమనించలేకపోతున్నారు. ప్రమాదాలు పొంచి ఉన్న స్థలాలను పసిగట్టలేక గడిచిన పదేళ్ల కాలంలో దాదాపు 25 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు.



ఎగసి పడుతున్న అలలు

జెట్టీ యమడేంజర్

తీరంలో ఉప్పునీటి కోసం 1990లో సముద్రం లోపల నుంచి ఏర్పాటు చేసిన ఎత్తిపోతల వంతెన(జెట్టీ) ప్రమాదకరంగా మారింది. ఈ వంతెన దాదాపు 200 మీటర్లు సముద్రంలోకి ఉండి, అక్కడి నుంచి 3 కి.మీ పొడవున ప్రవహిస్తూ ఉండేది. ఇది సుమారు 50 మీటర్ల ఎత్తు ఉంటుంది. ప్రస్తుతం ఈ వంతెన బాగా దెబ్బతింది. పిల్లర్లకు సిమెంటు పెచ్చులు ఊడి ఇనుప చువ్వలు దర్శనమిస్తున్నాయి. హాయిగా ఆహ్లాదాన్ని అందిస్తుందన్న సంతోషంతో కొందరు, మద్యం మత్తులో మరికొందరు వంతెన పైకి ఎక్కి సముద్రంలోకి దూకుతుంటారు. ఇలా దూకిన తర్వాత ప్రమాదాలబారిన పడి పలువురు జలసమాధి అవుతున్నారు. జెట్టీ నిర్మాణపు ప్రాంతానికి అతి సమీపంలో కెరటాల ఉధృతితో పాటు స్వతహాగా విపరీతమైన లోతు ఉంటుంది. తూపిలిపాళెం గ్రామ సమీపాన ఉన్న మొదటి తీరంలో పర్యాటకులకు స్నానాలు చేసేందుకు అనువుగా ఉంటుంది. కానీ ఎక్కువ మంది జెట్టీ అందాలను చూసేందుకు అక్కడికే వెళ్లి ప్రాణాలమీదికి తెచ్చుకుంటున్నారు. కానీ ఇక్కడ ప్రమాదాల నివారణకు ఎలాంటి హెచ్చరిక బోర్డులుగానీ, బారికేడ్లు కానీ లేకపోవడం విమర్శలకు తావిస్తోంది.

నిఘా పెంచాలి.. ప్రాణాలు రక్షించాలి

- తూపిలిపాళెం బీచ్‌లో ఆదివారం రోజుల్లో పోలీసులు నిఘా ఏర్పాటు చేయాలి.
- స్నానాలు చేసే సమయంలో సముద్రం వద్ద బారికేడ్లు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలి. వాటిని దాటి పర్యాటకులు వెళ్లనీకుండా హెచ్చరిక బోర్డులు పెట్టాలి.
- విద్యార్థులను విహారానికి పంపేటప్పుడు తల్లిదండ్రులు కొన్ని జాగ్రత్తలు చెప్పి పంపాలి. తమ పిల్లలు ఎవరి సంరక్షణలో వెళుతున్నారో కాస్త ఆరా తీయాలి.
- తూపిలిపాళెం గ్రామ సమీపంలోని స్వర్ణముఖి అతిథిగృహం ఎదురుగా ఉన్న మొదటి ఘాట్‌లోనే స్నానాలు చేయాలని, జెట్టీ వద్దకు వెళ్లరాదని పిల్లలకు చెప్పి మరీ పంపాలి. దీనిపై అధికారులు చర్యలు తీసుకుని కూలక ముందే జెట్టీ కూల్చే ప్రయత్నం చేయాలని గ్రామస్తులతోపాటు, పర్యాటకులు కోరుతున్నారు.

హెచ్చరిక బోర్డులు అవసరం



సరదా కోసం తూపిలిపాళెం బీచ్‌కు వస్తున్న పర్యాటకులు ప్రమాదకర ప్రాంతాలను గుర్తించలేక మృత్యువాత పడుతున్నారు. పోలీసులు ఇప్పటికైనా స్పందించి ప్రమాదాలు పొంచి ఉండే ప్రదేశాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడం అవసరం. అలాగే తీరంలో బారికేడ్లు ఏర్పాటు చేయాలి.

– రాయిపు రవీంద్ర, పర్యాటకుడు, కల్లూరు కొత్తపాళెం

ప్రమాదకరంగా ఉంది



సముద్ర తీరంలో ఏళ్ల క్రితం నిర్మించిన ప్రస్తుతం ప్రమాదకరంగా ఉంది. ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి. దీనిపై నుంచి చాలా మంది యువకులు సముద్రంలోకి దూకి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. ఈ ప్రాంతంలో పకడ్బందీగా భద్రత కల్పించాలి. లేకపోతే ఈ వంతెనను పూర్తిగా తొలగించాలి.

– వెంకటేశ్వర్లు, మత్స్యకారుడు, తూపిలిపాళెం

ఆదరించిన ప్రజలకు అండగా ఉండాలి

- నూకతోటికి మాజీ మంత్రి పెద్దిరెడ్డి సూచన



మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డితో నూకతోటి రాజేష్

వరదయ్యపాళెం: తక్కువ సమయంలో ఎక్కువగా ఆదరించిన సత్యవేడు నియోజకవర్గ ప్రజలకు, వైఎస్సార్‌సీపీ పార్టీ శ్రేణులకు అందుబాటులో ఉంటూ అండగా ఉండాలని మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సూచించారని వైఎస్సార్‌సీపీ సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ తెలిపారు. ఆదివారం పెద్దిరెడ్డిని ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిసినట్లు వెల్లడించారు. ఎన్నికల్లో ఓటమికి గల కారణాలను పెద్దిరెడ్డి అడిగి తెలుసుకున్నారన్నారు. 81వేలకు పైగా ఓట్లు వేసి ఆదరించిన ప్రజలకు అందుబాటులో ఉంటానని రాజేష్ పేర్కొన్నారు. కార్యకర్తలు సంయమనం పాటించి, ధైర్యంగా ఉండాలని సూచించారు. ఆయన వెంట సీనియర్ నాయకుడు భానుప్రకాష్ రెడ్డి ఉన్నారు.

శ్రీవారి దర్శనానికి 10 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 22 కంపార్ట్‌మెంట్లు ఖాళీగా ఉన్నాయి. శనివారం అర్ధరాత్రి వరకు 79,398 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 43,557 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. శ్రీవారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ.2.90 కోట్ల ఆదాయం వచ్చింది. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేని వారికి 10 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనమవుతోంది.

దాడుల సంస్కృతి దారుణం



చిన్నగొట్టిగల్లు సమావేశంలో మాట్లాడుతున్న చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి



తిరుపతి రూరల్ సమావేశంలో మాట్లాడుతున్న చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి

"అధికారంలోకి వచ్చామనే సంతోషంతో టీడీపీ నేతలు రెచ్చిపోతున్నారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు.. సానుభూతి పరులపై దాడులకు తెగబడుతున్నారు. ఒంటరిగా కనిపిస్తే చాలు రక్తం కళ్ల చూస్తున్నారు. ప్రజలు అప్పగించిన పదవిని ఉపయోగించుకుని పది మందికీ మంచి చేయాలి. ప్రత్యర్థులను దెబ్బతీసేలా అరాచకాలకు పాల్పడడం సరికాదు. ఈ సంస్కృతి ఎప్పుడూ చంద్రగిరి చరిత్రలో లేదు. ఇలాంటి దారుణాలను ఎన్నడూ చూడలేదు. ఇది సరైన విధానం కూడా కాదు. గత ఐదేళ్లుగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతిపక్ష పార్టీ వారిని అందరితో సమానంగా గౌరవించాను. సాయం కోరి వచ్చిన వారిని ఎప్పుడూ నొప్పించలేదు. ఎవరినీ వెనక్కు పంపలేదు. ఇప్పుడు అవన్నీ మరిచిపోయి విధ్వంసాలకు దిగడం ఎవరికీ మంచిదికాదు'' అని మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి స్పష్టం చేశారు.

- చంద్రగిరిలో ప్రత్యర్థులను భయపెట్టడమే టీడీపీ లక్ష్యం
- కొనసాగుతున్న ఆస్తుల విధ్వంసం
- ఐకమత్యంతో పచ్చమూకను ఎదుర్కొందాం
- ప్రతిదాడులతో సమస్య పరిష్కారం కాదు
- ప్రాణాలు అడ్డుపెట్టి కార్యకర్తలను కాపాడుకుంటా
- మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి



ఆత్మీయ సమావేశానికి వచ్చిన కార్యకర్తలకు భోజనం వడ్డిస్తున్న చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

భాకరాపేట : చంద్రగిరి నియోజకవర్గంలో ప్రత్యర్థులపై టీడీపీ నేతల దాడులు ఆగడం లేదని, యథేచ్ఛగా సాగుతున్న అరాచకాలతో భయానక వాతావరణం నెలకొని ఉందని మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం చిన్నగొట్టిగల్లు, చంద్రగిరి, తిరుపతి రూరల్, రామచంద్రాపురం మండలాల్లో ఆత్మీయ సమావేశాలు నిర్వహించారు. కార్యకర్తలతో మమేకమవుతూ వారికి మనోధైర్యం కల్పించారు. చెవిరెడ్డి మాట్లాడుతూ టీడీపీ నేతలు అధికారం మత్తులో ప్రత్యర్థి పార్టీని లేకుండా చేయాలని చూస్తే వదిలిపెట్టే ప్రసక్తే లేదన్నారు. ప్రాణాలు పణంగా పెట్టి మరీ కార్యకర్తలను కాపాడుకుంటామని తెలిపారు. అయితే దాడికి ప్రతి దాడి చేయడం సమస్యకు పరిష్కారం కాదని సూచించారు. ఐకమత్యంతో మెలిగితే దాడులను పకడ్బందీగా ఎదుర్కోవచ్చని పిలుపునిచ్చారు. ప్రశాంతతకు మారుపేరుగా నిలచే చంద్రగిరిలో తెలుగుదేశం కార్యకర్తలు గత మూడు రోజులుగా చేస్తున్న అరాచకాలను ప్రజలు గమనిస్తున్నారన్నారు. మనమంతా ధైర్యంగా ముందుకు వచ్చి ఎవరిపై దాడి జరిగినా క్షణాల్లో అక్కడకు చేరుకుని ఐక్యతను చాటుకుంటే అల్లరిమూకలకు భయం కలుగుతుందని చెప్పారు. కార్యకర్తలు, నాయకులతో ప్రభుత్వ ఆస్తులను సైతం ధ్వంసం చేయడం టీడీపీ పైశాచికత్వానికి నిదర్శనంగా నిలుస్తోందని విమర్శించారు. ఓటమి బాధలో ఉన్న సమయంలో మా కార్యకర్తలపై దాడులు చేయడం, భయపెట్టి లొంగదీసుకోవాలని చూడడం గతంలో ఎన్నడూ చంద్రగిరిలో జరగలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో చంద్రగిరి ఎమ్మెల్యేలుగా ఉన్నప్పుడు మీసాల వెంకటరామానాయుడు, రామ్మూర్తి నాయుడు, గల్లా అరుణకుమారి ఎవరూ ఎలాంటి దారుణాలకు పాల్పడలేదని వెల్లడించారు. ఇప్పుడు మాత్రమే ఎందుకు విధ్వంసాలు జరుగుతున్నాయో ప్రజలు గుర్తించాలని కోరారు. ఇప్పటికై టీడీపీ నేతలు ఈ దాడులను ఆపకుంటే ఎంతవరకైనా పోరాడుతామని, అవసరమైతే రోడ్డెక్కి ఆందోళనలు, ఆమరణ నిరాహార దీక్షలకు సైతం దిగుతామని హెచ్చరించారు. జిల్లా పోలీసు అధికారులు స్పందించి చంద్రగిరి నియోజక వర్గంలో ప్రశాంత వాతావరణం కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటి వరకు ఎన్నికలప్పుడు హడావుడి ఉన్నా తర్వాత ఎవరి పని వారు చేసుకుంటూ కలిసిమెలసి ఉండేవారమన్నారు. 2019లో పులివర్తి నాని రాకతో మంచి సంస్కృతికి తూట్లు పడ్డాయని ఆరోపించారు. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రత్యర్థులపై దాడులు చేసే స్థాయికి దిగజారిపోయారని విమర్శించారు. చంద్రగిరి ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, అభివృద్ధి చేసి చూపించాలని సూచించారు. అల్లరిమూకలతో విధ్వంసాలకు పాల్పడడం ఎవరికీ మంచిది కాదని స్పష్టం చేశారు. దాడులు చేయడం, చేయించడం తమకు తెలియదని, భగవంతుడిని నమ్ముకుని ముందుకు వెళతామని తెలిపారు. సమావేశంలో ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు, చంద్రగిరి నియోజకవర్గ ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

ఉద్యోగుల బకాయిల విడుదలకు డిమాండ్



మాట్లాడుతున్న ఆపస్ అధ్యక్షుడు బాలాజీ

తిరుపతి ఎడ్యుకేషన్ : ఎన్నికల ప్రచారంలో భాగంగా చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు నూతన ప్రభుత్వం కొలువుదీరిన వెంటనే ఉద్యోగుల దీర్ఘకాలిక బకాయిలను విడుదల చేయడంతోపాటు మెగా డీఎస్సీని ప్రకటించాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం(ఆపస్) రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.బాలాజీ డిమాండ్ చేశారు. ఆదివారం తిరుపతిలోని ఆపస్ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సంఘం అభ్యాస వర్గ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. బాలాజీ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల పోస్టులకు మంగళం పాడిన 117జీఓను వెంటనే రద్దు చేసి తద్వారా ఏర్పడ్డ ఖాళీలను మెగా డీఎస్సీలో పొందుపరచాలని కోరారు. అలాగే ఏపీజీఎల్ఐ, పీఎఫ్, ఈహెచ్ఎస్ పెండింగ్ బిల్లుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని, మహిళా ఉపాధ్యాయులకు ఇచ్చిన శిశు సంరక్షణ సెలవుల వాడకంలో విధించిన నిబంధనలను సవరించాలని సూచించారు. పాఠశాలల పనివేళలను ఉదయం 9.30నుంచి సాయంత్రం 4.30గంటల వరకు నిర్వహించేలా మార్పు చేయాలన్నారు. ఆపస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నాగరాజు, సాంబిరెడ్డి మాట్లాడుతూ కేజీబీవీలో పని చేస్తున్న ఉపాధ్యాయులకు ఈ విద్యాసంవత్సరానికి రెన్యువల్ చేసి వారిని క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. 1998, 2008 డీఎస్సీ ద్వారా ఎంపికై ఎంటీఎస్ ఉపాధ్యాయులుగా విధుల్లో చేరిన వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఆపస్ రాష్ట్ర నాయకులు చక్రపాణి, సుభాష్, దివాకర్, జిల్లా సహాధ్యక్షుడు డాక్టర్ దేవరాజులు, మహిళా నాయకులు లత, సౌజన్య, నాయకులు దాము, మనోహర్, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

ధ్వంసం.. నవరత్న నిలయం



ధ్వంసమైన శిలాఫలకాలు, బొమ్మలు



శ్రీకాళహస్తిలోని నవరత్నాల నిలయం (ఫైల్)

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి పట్టణ సమీపంలోని రాజీవ్‌నగర్‌లో నిర్మించిన నవరత్న నిలయంపై శనివారం అర్ధరాత్రి టీడీపీ కార్యకర్తలు దాడి చేశారు. శిలాఫలకాలు, వైఎస్సార్, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటాలను ధ్వంసం చేశారు. అక్కడ ఏర్పాటు చేసిన రైతు, గ్రామీణ మహిళ బొమ్మలను నాశనం చేశారు.ఈ క్రమంలో సుమారు40 మంది పచ్చపార్టీ శ్రేణులు ఆటోలు, కార్లలో రాజీవ్‌నగర్‌కు చేరుకుని కర్రలు, రాళ్లతో హల్‌చల్ చేస్తూ స్థానికులను భయభ్రాంతులకు గురిచేశారు. మొదట ప్రధాన రహదారి పక్కన నిర్మించిన కట్టడాల్లో దూరి షట్టర్లు విరగొట్టారు. అనంతరం విద్యుత్ మీటర్లు పగులగొట్టి, ఓ ఇంటి బోరులో పైపులను బయటకు లాగి మోటర్లను ఎత్తుకెళ్లారు. అనంతరం నవరత్నాల నిలయం వద్దకు చేరుకుని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, వైఎస్ రాజశేఖరరెడ్డి, బియ్యపు మధుసూదన్‌రెడ్డి, ఇతర మంత్రుల చిత్రపటాలను, శిలాఫలకాలను ధ్వంసం చేశారు. జగనన్న కాలనీ ముందు నిర్మించిన ఆర్చిపై రాళ్లతో దాడి చేసి పగులగొట్టారు. స్థానికులు స్పందించి పోలీసులకు ఫోన్ చేశారు. 2వ పట్టణ పోలీసులు అక్కడికి చేరుకోవడంతో దుండగులు పరారయ్యారు. ఆదివారం ఉదయం పురపాలసంఘ కమిషనర్ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. టీడీపీ కార్యకర్తలు పగులగొట్టిన వాటితోపాటు నిలయంలోని ఇతర చిత్రపటాలను తొలగించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రెండువేల ఇళ్లను జగనన్న కాలనీ పేరుతో ఇక్కడ పేదలకు పంపిణీ చేశారు. అందుకు గుర్తుగా కాలనీ ముందు ఖాళీ స్థలంలో అప్పటి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి సొంత నిధులతో నవరత్నాల నిలయం సెల్ఫీపాయింట్ ఏర్పాటు చేశారు. వాటిని సైతం పచ్చమూక ధ్వంసం చేయడంపై స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై పోలీసులను వివరణ కోరగా పురపాలకసంఘం వారు ఫిర్యాదు ఇస్తే తీసుకుంటామన్నారు. కమిషనర్ రమేష్‌బాబు మాట్లాడుతూ మొత్తం వివరాలను పోలీసులకు అందజేశామని తెలిపారు.

ఆధునిక విధానంలో కాన్పులు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎస్వీ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ చంద్రశేఖరన్

తిరుపతి తుడా: ఆధునిక విధానాలను జోడించి సాధారణ కాన్పులు చేయడంపై దృష్టి సారించాలని ఎస్వీ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చంద్రశేఖరన్ సూచించారు. ఆదివారం నిర్వహించిన నిరంతరం వైద్య విద్యా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గైనకాలజీ వైద్య విధానంలో శాస్త్రీయతతో పాటు ఆధునికతను అందుపుచ్చుకొని డెలివరీలు చేయాలని కోరారు. గైనకాలజిస్టులు గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. బిడ్డ ఆరోగ్యంవంతంగా పుట్టేందుకు అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. వైద్య విధానంలో చోటు చేసుకుంటున్న మార్పులను విద్యార్థులు ఎప్పటికప్పుడు గుర్తించాలని తెలిపారు. ఆ మేరకు నాణ్యమైన వైద్యం అందించడం బాధ్యతగా తీసుకోవాలని వెల్లడించారు. నిరంతర వైద్య విద్య అవగాహన కార్యక్రమాలు, హెల్త్ కాన్ఫరెన్స్‌లకు హాజరైతే అనుభవజ్ఞుల నుంచి మెలకువలను నేర్చుకోవచ్చని వివరించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు రుయా, మెటర్నిటీ ఆస్పత్రుల సూపరింటెండెంట్లు డాక్టర్ రవి ప్రభు , డాక్టర్ పార్థసారథి, వైద్యాధికారులు డాక్టర్ ప్రమీల దేవి, డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ సత్యనారాయణ మూర్తి, డాక్టర్ సాయి, ఎస్వీ మెడికల్ కళాశాల తోపాటు కుప్పం పీఈఎస్, చిత్తూరు అపోలో వైద్య కళాశాలలో పోస్ట్ గ్రాడ్యుయేట్ చేస్తున్న విద్యార్థులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు



తీవ్రంగా గాయపడిన శేషయ్య, నాగరాజు

నాయుడుపేట టౌన్ : పట్టణ పరిధిలోని తుమ్మూరు పాత చెక్‌పోస్టు సమీపంలో రహదారిపై ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు, పోలీసుల కథనం.. ఓజిలి మండలం, ముమ్మాయపాళెం గ్రామానికి చెందిన దొడ్ల నాగరాజు, కోట మండలం, రాఘవపురం గ్రామానికి చెందిన శేషయ్య ఓ ప్రవేటు బస్సులో డ్రైవర్లుగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఆదివారం రాత్రి పట్టణంలోని తుమ్మూరు పాత చెక్‌పోస్టు సమీపంలో ఉన్న బస్సును తీసుకెళ్లాల్సి ఉంది. ఈ క్రమంలో బస్సు సమీపంలో నాగరాజు, శేషయ్య రోడ్డును దాటుతున్నారు. నాయుడుపేట వైపు నుంచి గూడూరు వైపు వెళుతున్న కారు రోడ్డు దాటుతున్న నాగరాజు, శేషయ్యను అతి వేగంగా వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను 108 సిబ్బంది స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. హెడ్ కానిస్టేబుల్ మధు ప్రమాదం జరిగిన తీరును బాధితులనడిగి తెలుసుకున్నారు. కారు నంబరును స్థానికులు గుర్తించి పోలీసులు తెలిపారు. కారు ఆచూకీ కోసం పోలీసులు గాలిస్తున్నారు.

రాను పోను టికెట్‌తో ఆదా!

- తిరుపతి- తిరుమలకు రాయితీపై ప్రయాణం
- అధిక సంఖ్యలో మొగ్గుచూపుతున్న యాత్రికులు
- పలు దేవాలయాలకు వెళ్లేందుకు నడుస్తున్న ఆర్టీసీ బస్సులు


తిరుమల బస్సు ఎక్కుతున్న భక్తులు

జిల్లా ఆర్టీసీ సమాచారం	
డిపోల సంఖ్య	11
నిత్యం బస్సులు నడిచే దూరం	సుమారు 3.5 లక్షల కిలోమీటర్లు
రోజువారీ ఆదాయం	సుమారు రూ.1.60 కోట్లు



తిరుమల బస్టాండ్ కౌంటర్‌లో టికెట్ కొనుగోలు చేస్తున్న భక్తులు

తిరుపతి అర్బన్ : తిరుపతి- తిరుమలకు ఆర్టీసీ పెద్దసంఖ్యలో బస్సులు నడుపుతోంది. ఈ క్రమంలోనే తిరుమలకు వెళ్లే భక్తులు రానుపోను టికెట్ తీసుకుంటే రాయితీ ఇస్తోంది. దీనిపై ఇప్పటికే యాత్రికులకు వివిధ మార్గాల్లో అవగాహన కల్పించింది. దీంతో తిరుమలకు వెళ్లే వారిలో 99.5 శాతం మంది రాను పోను టికెట్లే కొనుగోలు చేస్తున్నారు. అలాగే తిరుపతి నుంచి జిల్లాలోని శ్రీకాళహస్తి, కాణిపాకం, అప్పలాయిగుంట, తిరుచానూరు, శ్రీవారి మెట్టుతోపాటు, శ్రీశైలం, నరసారావుపేట విజయవాడ, కంచి, తిరువణ్ణామలై తదితర ప్రాంతాల్లో ప్రముఖ ఆలయాలకు ఆర్టీసీ సర్వీసులను నడుపుతున్నారు. ఈ క్రమంలోనే ఆదాయంలో తిరుపతి ఆర్టీసీ రాష్ట్రంలోనే తొలి స్థానం దక్కించుకుంది.

రూ.20 రాయితీ..

తిరుపతి నుంచి తిరుమలకు సాదారణ రోజుల్లో 55 వేల నుంచి 65 వేల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. ప్రత్యేక రోజుల్లో అయితే రోజుకు లక్ష నుంచి 1.5 లక్ష వరకు భక్తులు ప్రయాణిస్తుంటారు. పెద్ద వారికి టికెట్ ధర వెళ్లడానికి రూ.90, తిరిగి రావడానికి రూ.90 లెక్కన మొత్తం రూ.180 అవుతుంది. అయితే రానుపోను టికెట్ తీసుకుంటే టికెట్‌పై రూ.20 రాయితీ ఇచ్చారు. మొత్తం రూ.160 చెల్లిస్తే సరిపోతుంది. మరోవైపు పిల్లలకు పోను రూ.50, తిరిగి రావడానికి రూ.50 చొప్పున మొత్తం రూ.100 చెల్లించాల్సి ఉంది. అయితే రాను పోను టికెట్ తీసుకుంటే రూ.90లే సరిపోతుంది. దీంతో వారికి రూ.10 ఆదా అవుతుంది. రానుపోను టికెట్ మూడు రోజుల (72 గంటలు) వరకు చెల్లుతుంది. ఈ విషయాన్ని భక్తులకు అర్థం అయ్యేలా ఆర్టీసీ అధికారులు వివరిస్తున్నారు. దీంతో గతంలో 20శాతం మంది భక్తులు మాత్రమే రానుపోను టికెట్ తీసుకునేవారు. అయితే గత నాలుగేళ్లుగా పెద్ద సంఖ్యలో అవగాహన బోర్డులు ఏర్పాటు చేయడంతో ఏటా 20శాతం పెరుగుతూ వచ్చారు. ప్రస్తుతం తిరుమలకు వెళ్లే భక్తుల్లో 99.5 శాతం మంది రానుపోను టికెట్ తీసుకుంటున్నారు. తిరుమలకు వెళ్లే ఆర్టీసీ సర్వీసులకు రాయితీలు ఇవ్వడంతో ప్రభుత్వానికి రోజుకు రూ.20లక్షలకు పైగా నష్టం వస్తున్నప్పటికీ, భక్తులకు అండగా ఉండాలనే ఉద్దేశంతో పకడ్బందీగా టికెట్ రాయితీ అందిస్తున్నారు.

ప్రత్యేక సర్వీసులు

తిరుపతి నుంచి తిరుమలతోపాటు దేశంలోని వివిధ ప్రాంతాల్లోని ఆలయాలకు ప్రత్యేక సర్వీసులను ఏర్పాటు చేశారు. దీంతో భక్తులకు ఎంతో సౌకర్యవంతంగా ఉందని పలువురు ప్రయాణికులు వెల్లడిస్తున్నారు.

ఎంతో ప్రయోజనం



తిరుపతి నుంచి తిరుమలకు వెళ్లడానికి భక్తులకు రానుపోను టికెట్ తీసుకుంటే ఎంతో ప్రయోజనం ఉంది. ఇది భక్తులకు ఎంతో సౌకర్యవంతంగా ఉంటుంది. మరోవైపు తిరుపతి నుంచి వివిధ ప్రాంతాల్లోని ప్రముఖ అలయాలకు ఆర్టీసీ సర్వీసులను ఏర్పాటు చేశారు. అన్ని సమయాల్లో ఆర్టీసీ సర్వీసులను తిరుపతి నుంచి ఉండడం సంతోషంగా ఉంది.
– మోహన్, తిరుపతి

భక్తులకు వివరిస్తున్నాం



టికెట్ కౌంటర్ వద్దే తిరుమలకు వెళ్లే భక్తులకు రాయితీ విధానాన్ని వివరిస్తున్నాం. టికెట్ కొనుగోలు చేసిన తర్వాత మూడు రోజుల పాటు చెల్లుతుందని చెబుతున్నాం. దీంతో అంతా రాయితీ టికెట్లు కొనుగోలు చేస్తున్నారు. మరోవైపు తిరుపతి నుంచి అన్ని ఆలయాలకు ఆర్టీసీ సర్వీసుల ఎప్పటికప్పుడు అనౌన్స్ చేస్తున్నాం. తిరుపతి బస్టాండ్ ద్వారా భక్తులకు మరింత సేవలను అందించడానికి సిద్ధంగా ఉన్నాం.
– డీఆర్ నాయుడు, అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్, తిరుపతి

ఇరువర్గాల దాడి కేసులో
పోలీసుల పక్షపాతం

పెళ్లకూరు : మండలంలోని చిల్లకూరు గ్రామానికి చెందిన టీడీపీ, వైఎస్సార్‌సీపీ వర్గీయుల దాడి కేసులో పోలీసుల పక్షపాత వైఖరిపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈనెల 6వ తేదీన చిల్లకూరులో టీడీపీ, వైఎస్సార్‌సీపీకి చెందిన వారు పరస్పరం దాడులకు పాల్పడిన విషయం తెలిసిందే. దీనిపై ఇరువర్గాలవారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే టీడీపీ వారిని పోలీసులు వదిలేసి కేవలం వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను మాత్రమే అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించడంపై స్థానికులు మండిపడుతున్నారు. వివాదస్పద గ్రామమైన చిల్లకూరులో ఎన్నికల కోడ్‌కు ముందు నుంచే పోలీస్ పికెట్, 144 సెక్షన్ అమలు చేస్తున్నప్పటికీ టీడీపీ నాయకుడు దువ్వూరు విజయసేనారెడ్డి బాణా సంచా పేల్చడం తదితర కవ్వింపు చర్యలతో రెచ్చగొట్టాడు. దీంతో ఘర్షణ తలెత్తింది. అయితే దాడులకు కారణమైన వారిని వదిలేసి వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై కక్షపూరితంగా పోలీసులు వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. టీడీపీ వారిని ఎందుకు అరెస్ట్ చేయడం లేదని ప్రశ్నిస్తున్నారు.

ఈతకు వెళ్లి గల్లంతు


మహేంద్ర (ఫైల్)

రాపూరు : స్నేహితులతో సరదాగా ఈతకు వెళ్లిన ఓ యువకుడు గల్లంతయ్యాడు. ఈ ఘటన రాపూరు మండలంలోని రాపూరు-చిట్వేలి ఘాట్ రోడ్డు సిద్ధేశ్వర కోనవద్ద ఆదివారం చోటుచేసుకుంది. ఎస్ఐ మల్యాద్రి కథనం.. నెల్లూరు మూడో మైలుకు చెందిన మహేంద్ర(18) నారాయణ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. తన స్నేహితులతో కలసి స్థానిక కోనేరులో ఈత కొట్టేందుకు వచ్చి గల్లంతయ్యాడు. పోలీసులు గాలిస్తున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో మెరుపులు

దేశంలోని ప్రముఖ ఐఐటీ విద్యాసంస్థల్లో ప్రవేశాలకు నిర్వహించిన జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షా ఫలితాల్లో జిల్లాలో పలువురు విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి ర్యాంకులు సొంతం చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు తమ మనోగతాన్ని 'సాక్షి'తో పంచుకున్నారు. – తిరుపతి ఎడ్యుకేషన్


జ్యోష్మితకు స్వీటు తినిపిస్తున్న తల్లిదండ్రులు

సాఫ్ట్‌వేర్‌గా రాణిస్తా

నా తల్లిదండ్రులు జీ.శ్రీనివాసులు, జీ.సుమలత ప్రవిజన్ స్టోర్స్ నిర్వహిస్తున్నారు. నేకు ఐఐటీ జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో ఈడబ్ల్యూఎస్‌పీడబ్ల్యు కేటగిరిలో జాతీయ స్థాయిలో మొదటి ర్యాంకు వచ్చింది. సాఫ్ట్‌వేర్ రంగంలో రాణించడం నా కల. మరింత రాణించి తల్లిదండ్రులకు జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకొస్తా.
– జీ.జ్యోష్మిత, మొదటి ర్యాంకర్

సాఫ్ట్‌వేర్ ఇంజినీరవుతా


వివేకానందకు స్వీటు తినిపిస్తున్న తల్లిదండ్రులు

ఐఐటీ బాంబేలో సీఎస్ఈ కోర్సు అభ్యసించి సాఫ్ట్‌వేర్ ఇంజినీరుగా స్థిరపడడమే నా లక్ష్యం. మా నాన్న సుభాష్ తిరుపతిలో కమర్షియల్ ట్యాక్స్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నారు. నా తల్లి శ్రీవాణి గృహిణి. జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో ఓపెన్ కేటగిరిలో జాతీయ స్థాయి 324వ ర్యాంకు వచ్చింది. జేఈఈ మెయిన్స్‌లో జాతీయ స్థాయి 1,677వ ర్యాంకు సాధించాను. అధ్యాపకుల సూచనలతో అడ్వాన్స్‌డ్‌లో 324వ ర్యాంకు రావడం ఆనందంగా ఉంది.
– ఎస్.వివేకానంద, 324వ ర్యాంకర్

ఐఐటీలో చదవడమే లక్ష్యం


పుష్కర్‌కు స్వీటు తినిపిస్తున్న తండ్రి

దేశంలోనే ప్రముఖ ఐఐటీ విద్యాసంస్థలో చదవడమే నా ఆశయం. మా నాన్న ఆర్.నాగేశ్వర నాయుడు ప్రభుత్వ ఉపాధ్యాయులు. తల్లి ఎన్.అభినంద హెల్త్ అసిస్టెంట్. జేఈఈ అడ్వాన్స్‌డ్ ఓపెన్ కేటగిరీలో జాతీయ స్థాయి 886వ ర్యాంకు వచ్చింది. ప్రముఖ ఐఐటీలో కంప్యూటర్ సైన్స్ కోర్సు అభ్యసించి జీవితంలో స్థిరపడడమే నా లక్ష్యం.
– ఆర్.పుష్కర్, 886 ర్యాంకర్

క్షణికావేశం.. తీసింది ప్రాణం


విజయ్ మృతదేహం

వెంకటగిరిలో దారుణం
- బార్ వద్ద వ్యక్తి దారుణ హత్య
- విచారిస్తున్న గూడూరు డీఎస్పీ


ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ సూర్యనారాయణ (ఇన్‌సెట్) విజయ్ (ఫైల్)

వెంకటగిరి రూరల్: క్షణికావేశం ఓ నిండు ప్రాణాన్ని బలితీసుకుంది. చిన్నపాటి వివాదం చినికిచినికి ఘర్షణదాకా వెళ్లింది. సహనం కోల్పోయిన ఓ వ్యక్తి మచ్చు కత్తితో దాడి చేయడంతో ఒకరు మృతిచెందారు. ఈ ఘటన వెంకటగిరి పట్టణంలోని పాలకేంద్రం సమీపంలో ఉన్న పినాకిని రెస్టారెంట్ బార్ వద్ద ఆదివారం చోటుచేసుకుంది. సీఐ సంగమేశ్వరరావు కథనం.. పట్టణంలోని బీసీకాలనీ బొప్పావురానికి చెందిన బొక్కసం విజయ్(35), మునెమ్మ దంపతులు తిరుపతి కరకంబాడి సమీపంలో ఉన్న అమరరాజా కంపెనీలో విధులు నిర్వర్తిస్తున్నారు. గత కొద్దిరోజుల క్రితం విజయ్‌కుమార్ తన కుటుంబ సభ్యులతో కలిసి బీసీ కాలనీలో ఉన్న తన సొంత ఇంటికి చేరుకున్నారు. ఇక్కడి నుంచే విధులకు హాజరవుతూ వస్తున్నారు. ఈ క్రమంలో ఆదివారం విజయ్‌కుమార్ స్థానిక పాలకేంద్రం సెంటర్ 32 కేవీ సబ్‌స్టేషన్ ఎదురుగా ఉన్న పినాకిని బార్ అండ్ రెస్టారెంట్ వద్దకు వెళ్లాడు. అక్కడ శ్రీకాళహస్తి మండలం, వెల్లంపల్లికి గ్రామానికి చెందిన నరసింహ విధులు నిర్వర్తిస్తున్నాడు. అక్కడ విజయ్, నరసింహులు మధ్య స్వల్ప వివాదం చోటుచేసుకుంది. ఆ తర్వాత మాటామాట పెరిగి ఘర్షణదాకా వెళ్లింది. క్షణికావేశానికి గురైన నరసింహులు పక్కనే ఉన్న మచ్చు కత్తితో విజయ్‌పై దాడి చేసి పరారయ్యాడు. రక్తపు గాయాలైన విజయ్ సమీపంలోని జియో పెట్రోల్‌బంక్ వద్దకెళ్లి అక్కడ అపస్మారక స్థితిలో పడిపోయాడు. గమనించిన స్థానికులు క్షతగాత్రుడ్ని చికిత్స నిమిత్తం 108 ద్వారా ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్తుండా.. పరిస్థితి విషమించడంతో విజయ్ మార్గమధ్యంలోనే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న గూడూరు డీఎస్పీ సూర్యనారాయణ, సీఐ సంగమేశ్వరరావు, ఎస్ఐలు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

దారి కాచి..కత్తులున్నాయని బెదిరించి..!
– బైక్ చోరీ

తడ: రాత్రి సమయంలో దారి కాచి, ప్రైవేటు పరిశ్రమకు విధులకు వెళ్తున్న సిబ్బందిని అటకాయించారు. తమ వద్ద కత్తున్నాయని బెదిరించారు. ఆపై బైక్ చోరీ చేసుకుని వెళ్లారు. ఈ ఘటన శనివారం రాత్రి మాంబట్టు సెజ్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ పీ.నరశింహారావు కథనం.. వరదయ్యపాళెం మండలం, పులివెల్లం గ్రామానికి చెందిన పరంధామ, రవి మాబట్టు సెజ్‌లోని ఓ ప్రైవేటు పరిశ్రమలో పనిచేస్తున్నారు. శనివారం రాత్రి విధులకు హాజరయ్యేందుకు బైక్‌పై మాంబట్టు సెజ్ పరిధిలోకి వచ్చారు. అక్కడ చీకటిలో గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు పెద్ద మాంబట్టు వద్ద జామాయిల్ తోటలో నుంచి బయటకు వచ్చి బైక్‌ని అడ్డగించారు. తమ వద్ద కత్తులున్నాయని, ఎదిరిస్తే చంపేస్తామని, మర్యాదగా మీ వద్ద ఉన్న వస్తువులు ఇచ్చి వెళ్లాలని బెదిరించారు. దీంతో భయపడ్డ బాధితులు బైక్ వదిలి పారిపోయారు. కొంత సమయం తర్వాత వచ్చి చూసే సరికి బైక్ లేదు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

ఆలయంలో దళారుల దందాకు కళ్లెం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో దళారుల దందాకు కళ్లెం వేస్తున్నట్టు ఈఓ ఎస్వీ నాగేశ్వరరావు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులను తప్పుదోవ పట్టించి దర్శనాల పేరుతో డబ్బులు వసూలు చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. దళారులను ఆలయంలోకి అనుమతించేది లేదని తేల్చిచెప్పారు. ఈ మేరకు సెక్యూరిటీగార్డ్స్, హోంగార్డ్‌స్‌కు ఆదేశాలు జారీ చేశారు. రాహు-కేతు మండపాల్లో సైతం వసూళ్లు చేయరాదని ఆయన ఆదేశించారు.

జోరుగా వరినాట్లు


ఏర్పేడు మండలం కోబాక సమీపంలో వర్షాలకు పొలాల్లో జలకళ

రేణిగుంట: జిల్లాలో గత కొద్ది రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో తూర్పు మండలాల్లో వరి నాట్లు ఊపందుకున్నాయి. ముఖ్యంగా వ్యవసాయ బోర్ల కింద ఉన్న పొలాల్లో నెల క్రితమే దుక్కులు దున్ని వరినాట్లు వేశారు. ప్రస్తుతం వరుణుడు కరుణించడంతో మిగిలిన మెట్ట భూములనూ సాగులోకి తెస్తున్నారు. గత సీజన్‌లో నియోజకవర్గంలో అధికంగా వరి సాగు చేశారు. క్వింటా రూ.2 వేల వరకు పలకడంతో ఆశించిన ఆదాయం గడించారు. దీంతో ఈ సారి కూడా వరిపైనే ఆశలు పెంచుకున్నారు. అయితే కూలీల సమస్య రైతులకు తలనొప్పిగా మారింది. మరింత ఎక్కువగా వర్షాలు కురిసి చెరువులు నిండుతాయన్న ఆశాభావంతో కొంతమంది రైతులు సాగుకు సమాయత్తమవుతున్నారు.

చెట్టొక్కటే ఫలాలు వేరు!

ఒక మామిడి చెట్టుకు సాధారణంగా ఒకే రకం కాయలు కాస్తుంది. ఓ రైతు విభిన్న ఆలోచన కారణంగా ఒకే చెట్టు నాలుగు రకాల ఫలాలను ఇస్తోంది. ఏర్పేడు మండలం కందాడ పంచాయతీ శివగిరి ఎస్టీ కాలనీ సమీపంలో రాజులకండ్రిగకు చెందిన వెంకటేశ్వరరాజు కృషి ఈ విధంగా ఫలించింది. 20ఏళ్ల కిందట ఒక మామిడి చెట్టుకు వివిధ కొమ్మలను అంటుకట్టి పెంచడంతో ఈ ఘనత సాధ్యమైంది. ఈ చెట్టులో బంగినపల్లి, రసాలు, పులవరీ, నార రకపు మామిడి కాయలు కాస్తుండడం విశేషం. – రేణిగుంట


మామిడి చెట్టు ఎదుట రైతు వెంకటేశ్వరరాజు




ఒక్కొక్క కొమ్మకు కాసిన వేర్వేరు రకాల మామిడి కాయలు